జోరుగా పతంగుల విక్రయాలు


కాజీపేట మైదానంలో పతంగులను ఎగురవేస్తున్న ఉత్సాహవంతులు



కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న కాజీపేటలోని పతంగుల విక్రయ కేంద్రం

కాజీపేట: సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు.. ఆకాశంలో రంగురంగుల గాలిపటాలు కనువిందు చేస్తుంటాయి. పండుగకు పక్షం రోజులకు ముందు నుంచే చిన్నా, పెద్ద అనే తేడాలేకుండా ప్రతీఒక్కరు గాలిపటాలను ఎగురవేస్తుంటారు. సంక్రాంతి పర్వ దినంలో గాలిపటాలకు విద్యార్థులు, యువత అధిక ప్రాధాన్యం ఇస్తుంది. కాజీపేట పట్టణంతోపాటు శివారు గ్రామాల్లో యువకులు పోటీపడి గాలిపటాలను ఎగురవేస్తున్నారు. మైదానాలు, ఇళ్లపైన పతంగులు ఎగురవేస్తూ సందడి చేస్తున్నారు. పిల్లల ఆసక్తికి అనుగుణంగా గాలిపటాలను వ్యాపారులు తయారు చేసి విక్రయిస్తున్నారు. ఈ ఏడాది సినీహీరోలు, క్రికెట్ ఆటగాళ్లు, రాజకీయ నాయకుల పటాలకు మంచి డిమాండ్ ఉందని వ్యాపారులు చెబుతున్నారు. కాజీపేట పట్టణంలోనే 50కిపైగా పతంగుల విక్రయ కేంద్రాలు వెలిశాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి కాస్త ధరలు పెరిగినా గిరాకీ మాత్రం తగ్గలేదని విక్రయదారుడు శ్రీనివాస్.. సాక్షితో చెప్పారు. సంక్రాంతి పండుగ ముగిసిన మరో పదిహేను రోజులపాటు పతంగుల విక్రయాలు సాగుతాయన్నారు.

క్లుప్తంగా

పతంగుల పంపిణీ



హసన్‌పర్తి: వాసవి క్లబ్, హసన్‌పర్తి ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండల కేంద్రంలో స్థానిక పాఠశాలలో పతంగులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్ రావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వద్దు.. కాగితం ముద్దు అని సూచించారు. క్లబ్ అధ్యక్షుడు శ్యాం సుందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు పున్నంచందర్, క్లబ్ ప్రతినిధులు నాగమళ్ల సుధీర్, గౌరిశెట్టి కృష్ణమూర్తి, అప్పని శంకర్, చిదర కరంచంద్, భీష్మనాథం, మాధవశంకర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌ల పక్కన గాలిపటాలు ఎగురవేయొద్దు



కాశిబుగ్గ: రైల్వే ట్రాక్‌ల పక్కన గాలిపటాలు ఎగురవేయొద్దని వరంగల్ ఆర్పీఎఫ్ సిబ్బంది సూచించారు. ఈమేరకు ట్రాక్ వెంబడి ఉన్న కాలనీల్లో బుధవారం అవగాహన కల్పించారు. ట్రాక్ పక్కన గాలిపటాలు ఎగురవేసే క్రమంలో అవి తెగి హైటెన్షన్ విద్యుత్ వైర్లలో చిక్కుకుంటే పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉందని తెలిపారు. అలాగే, పిల్లలు గాలిపటాలను చూస్తూ ట్రాక్‌పై పడి ప్రమాదం జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

హసన్‌పర్తి: భీమారంలోని డైమండ్ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్)లో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. వాసన్ ఐకేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు కంటి పరీక్షలు చేశారు. కార్యక్షక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ జగదీశ్వర్, డైరెక్టర్లు వెంకన్న, మహిపాల్‌రెడ్డి, ఎస్.కనకరాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



హసన్‌పర్తి: ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహబూబాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో హసన్‌పర్తికి చెందిన లిటిల్ సోల్జర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్ -14 విభాగంలో పాఠశాలకు చెందిన ఎస్.కిరణ్, సిద్ధు, ప్రథమ బహుమతి, అండర్ -17లో పాఠశాలకు చెందిన కౌశిక్, త్రివేద్‌నాయక్ ద్వితీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వారిని అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ అమరేందర్ రెడ్డి, పీఈటీ ఓంకార్, ఉపాధ్యాయులు శ్రావణ్‌కుమార్, పెండ్యాల రాజిరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆ అధికారులపై చర్య తీసుకోవాలని వినతి



హన్మకొండ అర్బన్: నగరంలో అక్రమంగా వెలిసిన, నిబంధనలు పాటించని బిర్యానీ సెంటర్లు, బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలపై చర్య తీసుకోవాలని పలుమార్లు విన్నవించినా స్పందించని అధికారులపై చర్య తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు ఫుడ్ సేఫ్టీ, కంట్రోల్ జోనల్ అధికారి అమృతశ్రీకి బుధవారం వినతిపత్రం అందజేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు మూల్యం చెల్లించాల్సి వస్తోందన్నారు.

స్కూటీని ఢీకొట్టిన లారీ

ఖిలా వరంగల్: వరంగల్ - ఖమ్మం రహదారిపై వెళ్తున్న స్కూటీని లారీ ఢీకొట్టడంతో ఓ మైనార్టీ హైస్కూల్‌లో వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ మహిళతోపాటు ఆమె కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన వరంగల్ హంటర్‌రోడ్డు జక్కలొద్ది క్రాస్‌రోడ్డు సమీపంలో బుధవారం జరిగింది. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం వరంగల్ శంభునిపేటలోని దూపకుంట రోడ్డుకు చెందిన రఫత్ సుల్తానా (44) జక్కలొద్దిలోని మైనార్టీ హైస్కూల్‌లో వార్డెన్‌గా పనిచేస్తున్నారు. తన కుమారుడితో కలిసి ఆమె బుధవారం ఉదయం స్కూల్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా జక్కలొద్ది క్రాస్ రోడ్డు సమీపంలో గుంటూరు నుంచి హనుమకొండకు వెళ్తున్న చేపల లారీ ఆ స్కూటీని ఢీకొట్టింది. దాంతో బైక్‌పై నుంచి కిందపడిన తల్లి, కుమారుడికి తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం అందజేసి లారీని నిలిపివేశారు. క్షతగాత్రులను హుటాహుటిన 108 వాహనంలో ఎంజీఎంకు తరలించారు.

టీజీపీఏ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

గీసుకొండ : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ (టీజీపీఏ) క్యాలెండర్‌ను వరంగల్ డీఎంహెచ్‌ఓ కె.వెంకటరమణ, హనుమకొండ డీఎంహెచ్‌ఓ బి.సాంబశివరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ బాధ్యులు కేక్ కట్ చేశారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్, రెండు జిల్లాల అధ్యక్షులు డి.ప్రకాశ్‌రావు, కందకట్ల శరత్ బాబు, నాయకులు వి.పద్మజాదేవి, ఉప్పు భాస్కర్ రావు, వెంకటరమణ, అవినాష్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు



కాజీపేట: చైతన్యపురి కాలనీలోని గోదాదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అధ్యాయనోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలతో పాటు నూతన వస్త్రాలతో ప్రత్యేక అలంకరణలు చేశారు. పండితుడు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో ఉత్సవాలను బుధవారం రెండోరోజూ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్‌కుమార్ గౌడ్, మేజర్ వడ్డెపల్లి నరేందర్, పూజారి రఘురామాచార్యులతో పాటు కాలనీ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ షెడ్ అభివృద్ధికి కృషి చేయాలి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ అభివృద్ధికి కార్మికులందరు కలిసికట్టుగా కృషి చేయాలని షెడ్ సీనియర్ డీఈఈ ప్రశాంత్ కృష్ణ సాయి అన్నారు. కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో రైల్వే మజ్దూర్ యూనియన్ ఎలక్ట్రిక్ లోకోషెడ్ బ్రాంచ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైల్వే మజ్దూర్ యూనియన్ ఈఎల్ఎస్ బ్రాంచ్ కార్యవర్గ సభ్యులు నాయిని సదానందం, ఎండీ.ఇబ్రహీం, ఎండీ.రహమత్‌అలీ, బీ.రవీందర్‌రెడ్డి, ఎస్.అరుణ్‌కుమార్, వై.శ్రీనివాస్, ప్రకాశ్‌బాబు, కుమారస్వామి, రాజు, చంద్రశేఖర్, శివప్రసాద్, ఆర్.శ్రీను, నరేష్, రాజీవ్, రాజయ్య, బీ.శ్రీనివాస్, సునీల్, కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో మాసశివరాత్రి పూజలు



కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో మాసశివరాత్రి ప్రత్యేక పూజలను బుధవారం నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. అనంతరం ఆలయ అవరణలోని యాగశాలలో చండీహోమం నిర్వహించారు. కాశీ విశ్వేశ్వరుడిని మధ్యాహ్నం అన్నంతో అలంకరించి అన్నపూజ చేశారు. కార్యక్రమంలో ఓరుగంటి కొమురయ్య, బొమ్మగాని కృష్ణమూర్తి, ఓంకారేశ్వర్, ఉమాశంకర్, దయాసాగర్, శ్రీరాముల పెద్దన్న, సతీష్, అంకమ్మ రావు, అర్చకుడు మార్త సందీప్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకుడు

కాశిబుగ్గ: పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ వీరయ్య, సముద్రాల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఏసీరెడ్డినగర్ సీపీఎం కార్యాలయంలో అసోసియేషన్ శివనగర్ కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను ప్రకటించాలని కోరారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కృష్ణమూర్తి, పెన్షనర్లు పాల్గొన్నారు.

వరంగల్ కోటలో పర్యాటకుల సందడి


శిల్పాల ప్రాంగణంలో పర్యాటకులు

ఖిలా వరంగల్: చారిత్రక ప్రసిద్ధి చెందిన ఖిలావరంగల్ కోటకు పర్యాటకులు బుధవారం భారీగా తరలివచ్చారు. దీంతో మధ్యకోట శిల్పాల ప్రాంగణం పర్యాటకులతో కిటకిటలాడుతూ సందడిగా మారింది. ఇతర జిల్లాలు, నగర ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి శిల్పాల ప్రాంగణంలోని శిల్ప సంపద, ఖుష్‌మహల్, ఏకశిల గుట్ట, రాతి మట్టికోట అందాలను తిలకించారు. కాకతీయుల నిర్మాణాల శైలి, నల్లరాతిలో నిర్మించిన శిల్పకళా సంపద మహాద్భుతంగా ఉందని కొనియాడారు. కార్యక్రమంలో టీఎస్‌టీడీసీ కోట ఇన్‌చార్జ్ గట్టికొప్పుల అజయ్, కేంద్ర పురావస్తుశాఖ కోట ఇన్‌చార్జ్ శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



కాజీపేట: కాజీపేట శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో బుధవారం ధనుర్మాసోత్సవ వేడుకలను పురస్కరించుకుని చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవాలను కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ జ్యోతి ప్రజ్వలన చేయగా, సినీ నృత్య దర్శకురాలు సీతారత్నం ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన నిర్వహించారు. నిత్యం ఆలయాల సందర్శన, భక్తి భావం అనే అంశాలపై అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనల్లో గెలుపొందిన విజేతలకు ఆలయ వ్యవస్థాపకుడు ఐనవోలు సాయికృష్ణ శర్మ బహుమతులు ప్రదానం చేశారు.

ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ అధ్యక్షుడికి శుభాకాంక్షలు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా నాయకులు

హన్మకొండ అర్బన్: ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు సుభాష్ లాంబ బుధవారం హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను హనుమకొండ, వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షులు ఆకుల రాజేందర్, గజ్జల రాంకిషన్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీష్, జిల్లా నాయకులు బైరి సోమయ్య, శ్యాంసుందర్, రాముశాయక్, లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరికి ఎంపీ టికెట్ ఇవ్వాలి

హన్మకొండ: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కాంగ్రెస్ ఓబీసీ సెల్ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జ్ ఉల్లెంగల యాదగిరికి ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించాలని అధిష్టానాన్ని ఆ పార్టీ మహిళా పూర్వ జిల్లా మాజీ అధ్యక్షురాలు చిన్నాల సరళాదేవి కోరారు. ఈమేరకు హనుమకొండ రాంనగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇటీవల శాసనసభకు జరిగిన ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ, పాలకుర్తి నియోజకవర్గాల నుంచి ఆయన టికెట్ ఆశించారని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రఫియొద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఉద్యమకారులు బీసీ నేత, రాష్ట్ర విశ్వ విద్యాలయాల పార్ట్ టైం లెక్చరర్ల అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సోల్తి కిరణ్‌గౌడ్‌కు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని బీసీ విద్యార్థి సంఘం కేయూ అధ్యక్షుడు సుధగాని మధుగౌడ్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కేయూ బీసీ విద్యార్థి సంఘం బాధ్యులు అన్వేష్, మహేందర్, నవీన్, సాయి, శశి, శాంసన్, వెంకటేష్, బాలు, శ్రీకాంత్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రక్షాళన చేయాలి

హన్మకొండ: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీని పారదర్శకంగా నిర్వహించడానికి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేయాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు అన్నారు. ఈమేరకు తను రాసిన లేఖను సీఎం రేవంత్ రెడ్డికి మెయిల్ ద్వారా పంపారు. హనుమకొండ సుబేదారిలో ఆ లేఖను బుధవారం విడుదల చేసి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగాల భర్తీకి టీఎస్ పీఎస్సీ చేపట్టిన పరీక్షల నిర్వహణలో వైఫల్యం చెందిందని విమర్శించారు. దీంతో నిరుద్యోగులు ఆత్మస్థైర్యం కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగుల్లో విశ్వాసం పెంపొందించేందుకు టీఎస్ పీఎస్సీని ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని గుర్తుచేశారు. టీఎస్ పీఎస్సీని రాజకీయ పునరావాస కేంద్రంగా కాకుండా నిపుణులతో బోర్డుని ఏర్పాటు చేసి యూపీఎస్సీ తరహాలో పరీక్షల నిర్వహణకు సంస్కరణలు తీసుకురావాలని కోరారు.

కేయూ హాస్టళ్ల డైరెక్టర్ శ్రీనివాస్‌రావుకు సన్మానం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్ల డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌రావును కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం బాధ్యులు డాక్టర్ వెంకట గోపినాథ్, డాక్టర్ చిర్ర రాజుగౌడ్ కామన్ మెస్ వద్ద ఆయనను బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ చీకటి శ్రీనివాస్, డాక్టర్ నర్సింహారావు పాల్గొన్నారు.

తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఎన్నిక



మడికొండ: తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ మడికొండ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోపనబోయిన రాజు, సలహాదారులుగా బరిగల కృష్ణమూర్తి, దార సూరి, మాచర్ల రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఎండీ.సలీమ్, బోగి రాజు, వస్కుల రాజ్‌కుమార్, చల్ల సతీష్, బుర్ర ఎల్లగౌడ్, ప్రధాన కార్యదర్శిగా జిట్ట సదానందం, సహాయ కార్యదర్శిగా లింగాల సురేష్, నర్ర భాను, కార్యదర్శిగా మోడం ముకుందం, బిల్ల సంతోష్, కోశాధికారిగా మద్దెల కుమారస్వామి, సహాయ కోశాధికారిగా పల్లపు చిన్నరమేష్, ప్రచార కార్యదర్శిగా ఎండీ.సాదిక్, గడ్డం కిరణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా అల్లం హరీశ్, సందీప్, రాహుల్, కోటి, రమేష్, మొగిలిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అగ్రంపహాడ్ జాతరకు ఏర్పాట్లు చేయండి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- అధికారులతో సమీక్ష



సమీక్షలో ఎమ్మెల్యే రేవూరి, అదనపు కలెక్టర్లు

హన్మకొండ అర్బన్: అగ్రంపహాడ్‌లో జరుగనున్న సమ్మక్క సారలమ్మ జాతరకు అధికారులు ఏర్పాట్లు చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జాతర ఏర్పాట్లపై రేవూరి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా కనీస వసతులు కల్పించాలన్నారు. కలెక్టర్ సిక్తాపట్నాయక్ మాట్లాడుతూ.. మొత్తం పనులు ఫిబ్రవరి 18 నాటికి పూర్తి చేయాలన్నారు. జాతరలో ప్లాస్టిక్ వాడకాన్ని లేకుండా చూడాలని, మహిళలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్‌జీ, పరకాల ఆర్డీఓ శ్రీనివాస్, ఏసీపీ కిషోర్‌కుమార్, దేవాదాయ, ఆర్టీసీ, పీఆర్, రెవెన్యూ ఇతర అనుబంధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

డప్పు, చెప్పు వృత్తిదారులకు పింఛన్ ఇవ్వాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

హన్మకొండ: డప్పు, చెప్పు వృత్తిదారులకు పింఛన్ ఇవ్వాలని, పారిశుద్ధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలని ఎమ్మార్పీఎస్ -టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పోరుగర్జన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, డప్పు, చెప్పు కార్మికులను ఆదుకోవాలని గత ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోలేదని విమర్శించారు. ఫిబ్రవరి 29న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద పోరుగర్జన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ - టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మేడ స్వామి, బొచ్చు మొగిలి, నాయకులు జన్ను సంజీవ్, తీగల సదన్, రాకేష్, గంగారపు యశ్వంత్, కొడవటి తిరుపతి, నాగరాజు, కొయ్యడ యాదగిరి, రాజు, గిన్నారపు అనిల్ కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ వర్సిటీ భూముల కేటాయింపు సరికాదు


మాట్లాడుతున్న ప్రశాంత్

కేయూ క్యాంపస్: హైకోర్టు భవనాలకు అగ్రికల్చర్ యూనివర్సిటీ భూముల కేటాయింపును రద్దు చేయాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కేయూ అధ్యక్షుడు కొక్కుల ప్రశాంత్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ భూముల్లో హైకోర్టు భవనాలు నిర్మించేందుకు కేటాయించటం సరికాదన్నారు. దాన్ని ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఏబీవీపీ కేయూ సెక్రటరీ బొండ్ల శ్రావణ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, నాయకులు రామ, ప్రణయ్, సాయికృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు


హన్మకొండ: హరిదాసు, సోదెమ్మ వేషధారణలో దివ్యాంగులు


నయీంనగర్: ముగ్గు వేసిన చిన్నారులు

హన్మకొండ: హనుమకొండ సర్క్యూట్ హౌజ్ రోడ్డులోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. మానసిక దివ్యాంగులు హరిదాసు, సోదెమ్మ వేషధారణలో చిన్నారులు అలరించారు. బోగి మంటలు వేసి, గాలిపటాలు ఎగురవేశారు. బొమ్మల కొలువు పెట్టి, రంగవల్లులు వేసి ఆట పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు అనితారెడ్డి మాట్లాడుతూ పండుగ అంటే తమ సంతోషం మాత్రమే కాదని, పదిమందికి ఆనందాన్ని పంచడమే నిజమైన పండుగ అని సూచించారు. అనాథలు, మానసిక దివ్యాంగులకు మధ్య వేడుకలు జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు సుచరిత, రాజేందర్ రెడ్డి, సుష్మ, కరుకాల అర్విక, వసుధ, హరిత పాల్గొన్నారు.

ఏకశిల హైస్కూల్‌లో..

నయీంనగర్: హనుమకొండ కేయూసీ రోడ్డులోని ఏకశిల హైస్కూల్‌లో ముందస్తుగా సంక్రాంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో రంగురంగుల ముగ్గులు వేశారు. గాలిపటాలు ఎగురవేసి, ఆటపాటలతో సందడి చేశారు. ప్రిన్సిపాల్ బేతి శైలజారెడ్డి, ఉపాధ్యాయులు వేణుగోపాల్, స్వప్న, స్వాతి, కల్పన, సుమలత, జ్యోతి పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు అభినందనలు


పుష్పగుచ్ఛం అందిస్తున్న గ్రంథాలయ ప్రతినిధులు

హన్మకొండ అర్బన్: అదనపు కలెక్టర్ రాధికాగుప్తాను హనుమకొండ గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శైలజాదేవి ఆధ్వర్యంలో పలువురు ప్రతినిధులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ కరుణాకుమారి, సంతోష్‌కుమార్, కుమారస్వామి, రాజేష్ తదితరులు ఉన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

కేయూ క్యాంపస్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గ్రాడ్యుయేట్లు ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని టీజీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిర్ర రాజుగౌడ్ కోరారు. ఈమేరకు కళాశాలలో ఓటు నమోదుపై బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.